
19-05-2025
సోమవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 231 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB
జయభేరి



# బాధితులకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా!

## పాత బస్తీ అగ్ని ప్రమాదంపై ప్రధాని మోదీ ఆరా..

హైదరాబాద్ పాతబస్తీలోని మీర్ చౌక్ ప్రాంతంలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందారు. ఇంకా కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 పరిహారం ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది.

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని పాతబస్తీ మీర్ చౌక్ ప్రాంతంలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 17 మంది మృతిచెందినట్లు సమాచారం. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. అగ్ని ప్రమాదం జరిగిన చోట స్పాట్‌లో ముగ్గురు మృతి చెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో 14 మంది తుదిశ్వాస విడిచినట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య భారీగా ఉండటంతో దేశవ్యాప్తంగా ఈ సంఘటన సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై ప్రధాని మోదీ ద్రిగ్భాంతి వ్యక్తం చేస్తూ.. ఘటన గురించి అధికారులను అడిగి ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఘటన జరిగిన వెంటనే కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఘటనా స్థలిని పరిశీలించారు. తాజాగా మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి నుండి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల పరిహారం ప్రకటించారు ప్రధాని మోదీ. అలాగే, గాయపడిన వారికి రూ. 50,000 ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలు ఈ దుఃఖం నుండి త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం బాధితులకు తక్షణ సహాయం అందిస్తుందని ప్రధానమంత్రి కార్యాలయం ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. కాగా ప్రమాదం జరిగిన సమయంలో భవనంలో సుమారు 30 మంది ఉండగా, 17 మంది మరణించారు. మరికొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

# మిస్ వరల్డ్ పోటీల ఫార్మాట్ మే 31న ఫైనల్



2 లో

హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 108 దేశాల నుండి వచ్చిన అందాల భామలు కిరీటం కోసం పోటీ పడుతున్నారు. ఖండాల వారీగా విభజించి, తుది రౌండ్‌కు నలుగురిని ఎంపిక చేస్తారు. ఈ నెల 31న ఫైనల్ జరగనుంది. అయితే, రామప్ప దేవాలయాన్ని సందర్శించినపుడు జరిగిన ఒక చిన్న సంఘటన వివాదానికి దారితీసింది. అదలా ఉంచితే.. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్.. ఈ పోటీల ఫార్మాట్‌ని వెల్లడించింది.

# ఏపీలో తీవ్ర విషాదం



- ఏడుగురు చిన్నారుల మృతిపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి..

**విజయవాడ, మే 18:**

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం, చిత్తూరు జిల్లాల్లో జరిగిన వేరు వేరు ప్రమాదాల్లో ఏడుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే రోజు రెండు ప్రాంతాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో ఏకంగా ఏడుగురు పసిబిడ్డలు దూరమవ్వడం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. బాధిత కుటుంబాలకు సీఎం తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీలో ఒకే రోజు ఏడుగురు చిన్నారులు మృతి చెందిన ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం దేవరాజపురం గ్రామానికి చెందిన ముగ్గురు పిల్లలు అడుకుంటూ నీటి కుంటలో పడి ప్రాణాలు కోల్పోయిన ఘటనపై

...మిగతాది 2 లో



# మద్యం ప్రియులకు దిమ్మతిరిగే షాక్..

- మద్యం ధరల పెంపు సర్క్యులర్
- అధికారిక ప్రకటన చెయ్యని ఎక్సైజ్ శాఖ
- ధరల పెంపుపై మందుబాబుల ఆందోళన

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో మందు బాబులకు ఊహించని షాక్ తగిలింది. ఇప్పటికే ధరాఘాతంతో ఇబ్బంది పడుతున్న మందుబాబులు, తాజాగా మరో మారు లిక్కర్ ధరలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వడదెబ్బ కొట్టినట్టు షాక్ లో ఉన్నారు. ఇటీవల బీర్ల ధరలను పెంచిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు ఇతర మద్యం ధరలను కూడా పెంచడానికి సిద్ధమైంది. మార్కెట్ ధరల ఆధారంగా కొత్త రేట్లు అమలులోకి రానున్నాయని తెలుస్తుంది. తాజాగా తెలంగాణ రాష్ట్రంలో కొత్త ధరలు అమలులోకి వచ్చే అవకాశం కనిపిస్తుంది. మద్యం ధరలను పెంచుతున్నట్టు ఇప్పటికే మద్యం షాపులకు ఎక్సైజ్ శాఖ అధికారులు సర్క్యులర్లు పంపినట్లు సమాచారం. ఆ సర్కులర్ ప్రకారం లిక్కర్ ధరలను పెంచి విక్రయించవలసి ఉంటుంది. ఈ మేరకు లిక్కర్ షాపులు సిద్ధం అవుతున్నాయి. దీని ప్రకారం 180 మిల్లీ లీటర్లకు

...మిగతాది 2 లో

# ఉలిక్కిపడ్డ తెలంగాణ

- గుల్జార్‌హౌస్ ప్రమాదంపై విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని గుల్జార్‌హౌస్ జరిగిన అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రమాదానికి కారణాలపై లోతుగా దర్యాప్తు చేయాలని అధికారులకు సూచించారు. అగ్నిప్రమాదంలో 17 మంది మృతిచెందడం బాధాకరమని.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని తెలిపారు.

ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఓల్డ్‌సిటీలో అగ్నిప్రమాదం జరిగిందని ప్రాథమిక నిర్ధారణకి వచ్చారు అధికారులు. ఏసీ కంప్రెసర్ పేలిపోవడంతో పాటు, ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని చెబుతున్నారు. ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ లేని ఓల్డ్ బిల్డింగ్ కావడంతో లోపలున్న వాళ్లెవరూ తప్పించుకోలేకపోయారని అంటున్నారు. కాగా..

...మిగతాది 2 లో



# భాగ్యనగరంలో కరాచీ రగడ...

...మిగతాది 2 లో

# బీఆర్ఎస్ లో చీలక

## తెలంగాణ షర్మిళ కవిత..

## పాపం ఊరికే పోదు

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## ఏపీలో తీవ్ర విషాదం

సీఎం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన పిల్లలు గౌతమి, శాలిని, అశ్విన్ నీటి కుంటలో పడి ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. బిడ్డల మృతితో తీవ్ర శోకంలో ఉన్న తల్లిదండ్రులకు సీఎం చంద్రబాబు సానుభూతి తెలిపారు. మరోవైపు విజయనగరం జిల్లా ద్వారపూడి గ్రామంలో కారు డోర్లు లాక్ పడిన సంఘటనలో నలుగురు చిన్నారులు చనిపోవడంపై చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆడుకునేందుకు వెళ్లిన పిల్లలు...ఆగి ఉన్న ఒక కారు ఎక్కగా డోర్ లాక్ పడి బయటకు రాలేక అందులోనే చనిపోయిన ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. కారులో చిక్కుకుని ఊపిరి అందక ఉదయ్, జాశ్రిత, చారులత, మణీశ్వరి ప్రాణాలు కోల్పోవడంపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. రెండు ఘటనల్లో 10 ఏళ్లు కూడా నిండని బిడ్డలు చనిపోవడం తనను తీవ్ర వేదనకు గురిచేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ప్రకటనలో తెలియజేశారు. మరోవైపు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా ఈ సంఘటనలపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రెండు వేరు వేరు ప్రమాదాల్లో ఏడుగురు చిన్నారులు చనిపోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆమె అన్నారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఉలిక్కిపడ్డ తెలంగాణ

హైదరాబాద్‌లోని గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదంపై విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రమాద కారణాలపై లోతుగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. అగ్నిప్రమాదంలో 17 మంది మృతిచెందడం బాధాకరమని.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని తెలిపారు.

**సంచలన విషయాలు వెల్లడి..**

గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.. భవనం పైనుంచి కిందుకు రావాలన్నా... కింది నుంచి పైకి వెళ్లాలన్నా ఒకటే దారి.. అదీ కూడా చాలా ఇరుకైన మార్గం కావడం కూడా ప్రమాద స్థాయిని పెంచింది. ఘటన జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది చిన్న మెట్ల గుండా లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నం చేసింది. అయితే, అవి.. టన్నెల్ లాంటి మెట్లు కావడంతో ఫైర్ సిబ్బందికి కూడా తక్షణ సాయం చేయడానికి కొంత అవరోధం కలగడం కూడా ఇంతమంది మరణాలకు కారణమైంది. షట్టర్, గోడ బద్దులుకొట్టాకే లోపలికి వెళ్లాల్సి వచ్చింది. అప్పటికే చాలా నష్టం జరిగిపోయింది. టెర్రస్ కింద మెట్ల పక్కనే ఒక్కసారిగా మంటలు భారీగా వ్యాపించడంతో... బాధితులంతా టెర్రస్ మీదకి వెళ్లే ప్రయత్నం చేశారు. అయితే టెర్రస్ పైన ఉన్న మెట్లకు కూడా తాళం వేయడంతో ప్రమాదం నుంచి ఏ మాత్రం తప్పించుకునే అవకాశం లేకపోయింది. బిల్డింగ్ బయటికి G+1... లోపల మాత్రం G+2గా నిర్మించినట్లు తెలిపారు అధికారులు. g+2కి ఎలాంటి పర్మిషన్ లేదని చెబుతున్నారు. అలా అక్రమ నిర్మాణం కూడా ప్రమాదానికి మరో కారణంగా చూస్తున్నారు. అగ్నిప్రమాద ఘటనను రేవంత్ సర్కార్ సీరియస్‌గా తీసుకుంది. ప్రమాద కారణాలపై లోతుగా దర్యాప్తు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో నిజంగానే ప్రమాదమా...? లేక కుట్రకోణం ఏమైనా దాగుందా...? అనే అంశాలపైన కూడా కూపీ లాగుతున్నారు అధికారులు.

## మద్యం ప్రియులకు దిమ్మతిరిగే షాక్

క్వార్టర్ బాటిల్ పైన పది రూపాయలు, హాఫ్ బాటిల్ పైన 20 రూపాయలు, ఫుల్ బాటిల్ పైన 40 రూపాయలు లిక్కర్ ధరలు పెంచుతున్నట్టు సమాచారం. అయితే మద్యం దుకాణాలకు జారీ చేసిన సర్కులర్ లో ఈ విషయాన్ని ఎక్సైజ్ శాఖ స్పష్టంగా పేర్కొన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ సంవత్సరం ఫిబ్రవరి మాసంలో బీరు ధరలను 15 శాతం పెంచింది ప్రభుత్వం. లిక్కర్ ధరలను కూడా పెంచడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. 10 నుంచి 15 శాతం వరకు లిక్కర్ ధరలను పెంచాలని తెలంగాణ ప్రభుత్వం భావించింది. ఇక ఫైనల్ గా త్వరలోనే మద్యం ధరల షాక్ ఇవ్వడానికి రంగం సిద్ధం చేస్తుంది .అయితే ఇప్పటివరకు లిక్కర్ ధరలను పెంపు చేస్తున్నట్టు ఎక్సైజ్ శాఖ అధికారికంగా ప్రకటన చేయలేదు. దీంతో మద్యం ప్రియులను లిక్కర్ ధరల పెంపు పైన ఆందోళన నెలకొంది. ఇటీవలే బీర్ల ధరలు పెంచారని, మళ్ళీ ఏం ధరల పెంపు అని మద్యం ప్రియులు వాపోతున్నారు. అయితే ధరలను పెంచినా మందు బాబులు మాత్రం లిక్కర్ కొనుగోలు చేసి తాగడంలో తగ్గేదే లేదు అన్నది మనందరికీ తెలిసిందే.

## పాపం ఊరికే పోదు..

**పాకిస్తాన్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ హతం..**

**ఇంట్లో నుంచి బయటకు రాగానే..**



లష్కరే తోయిబా కీలక ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ పాకిస్తాన్‌లో హతమయ్యాడు. సింధ్ ప్రావిన్స్‌లో గుర్తుతెలియని దుండగులు లష్కరే తోయిబా టాప్ కమాండర్ రజౌల్లా నిజామాని అలియాస్ అబూ సైఫుల్లా ఖలీద్‌ను కాల్చిచంపారు. సింధ్ ప్రావిన్స్‌లోని మట్లీ నగరంలోని ఫాల్కారా చౌక్ సమీపంలో అతన్ని చంపినట్లు పాక్ అధికారులు తెలిపారు. అతను తన ఇంటి నుండి బయటకు రాగానే.. గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు.. దీంతో ఖలీద్ అక్కడికక్కడే చనిపోయాడు.. అబూ సైఫుల్లా ఖలీద్ మలన్ ప్రాంత నివాసి, అతను చాలా కాలంగా కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలలో పాల్గొన్నాడని అధికారులు తెలిపారు.
భారత్‌లోని నాగ్‌పూర్, రాంపూర్, బెంగళూరు దాడుల్లో ఖలీద్ హస్తం ఉంది. ఫేక్ ఐడీతో నేపాల్‌లో తలదాచుకున్న సైఫుల్లా ఖలీద్..ఇటీవలే సింధ్ ప్రావిన్స్‌కు మకాం మార్చాడు. పహల్గామ్‌లో దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులు భారత్‌లో చొరబడేందుకు సైఫుల్లా సహకరించినట్టు గుర్తించారు పోలీసులు. ఆపరేషన్ సింధూర్ తర్వాత.. సైఫుల్లా ఖలీద్‌కు భద్రత కల్పించింది పాకిస్తాన్ ప్రభుత్వం.. ఈ క్రమంలో అతన్ని కొందరు కాల్చి చంపడం కలకలం రేపింది. కాగా.. కాశ్మీర్ జిహాద్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత, లష్కరే తోయిబా అతనికి ఘాజీ అబూ సైఫుల్లా అనే బిరుదును ఇచ్చింది. అయితే, ఇటీవల ఆ సంస్థ అతన్ని అప్రమత్తం చేసిందని.. అతని కార్యకలాపాలను పరిమితం చేయాలని కూడా సూచించిందని సమాచారం.. అంతేకాకుండా అతనికి భద్రత కూడా కల్పించారు.. కానీ అతను మట్లి పట్టణంలోని తన ఇంటి నుండి బయటకు అడుగు పెట్టగానే.. కొందరు వ్యక్తులు అతని తల, ఛాతీపై కాల్చి హతమార్చారు..

**ఈ మూడు దాడుల వెనుక సైఫుల్లా ప్రధాన సూత్రధారి..**

రాంపూర్ CRPF శిబిరంపై దాడి... 2001లో, ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లోని CRPF గ్రూప్ సెంటర్‌పై ఉగ్రవాద దాడికి రజావుల్లా నిజామాని ప్లాన్ చేశాడు. ఈ దాడిలో, ఉగ్రవాదులు కాల్పులు జరిపారు.. ఇందులో ఏడుగురు సైనికులు అమరులయ్యారు. తరువాత, ఈ దాడి ప్రణాళికకు సంబంధించి దర్యాప్తు సంస్థలు ముందుకు తెచ్చిన పేర్లలో అబూ సైఫుల్లా అగ్రస్థానంలో ఉన్నాడు.
బెంగళూరులో వరుస పేలుళ్లు.. 2005లో బెంగళూరులో జరిగిన వరుస పేలుళ్లకు కూడా అబూ సైఫుల్లా కుట్ర పన్నాడు. ఈ పేలుళ్లతో బెంగళూరు నగరం దద్దరిల్లింది. ఐటీ కంపెనీలు, ప్రభుత్వ సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. 2006 సంవత్సరంలో, నాగ్‌పూర్‌లోని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రధాన కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని పెద్ద దాడికి ప్రయత్నించారు. భద్రతా దళాలు దాడి చేసిన వారిని సకాలంలో హతమార్చినప్పటికీ, ఈ దాడి వెనుక కూడా అబూ సైఫుల్లా సూత్రధారి అని దర్యాప్తులో స్పష్టమైంది.

# భాగ్యనగరంలో కరాచీ రగడ...

భాగ్యనగరం సర్వ మతాలకు విభిన్న సాంప్రదాయాలకు ఇక్కడ అనువైన ప్రాంతం. ఎక్కడెక్కడి నుంచో దేశం నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి విభిన్న రకాల ప్రజలు వారి సంస్కృతులు సాంప్రదాయాలు కలగలిపి హైదరాబాద్ ప్రసిద్ధిగాంచింది.




**జయభేరి, హైదరాబాద్ :**

కుల మతాలకు సంస్కృతి సాంప్రదాయాలకు ఆధునిక సాంకేతిక పోకడలకు అనువైనదిగా హైదరాబాద్ ప్రాంతం పేరు పొందింది. కానీ ఆపరేషన్ సింధూర్ తరువాత భాగ్యనగరంలో పరిస్థితులు మారిపోతున్నాయి. పాకిస్తాన్ జిందాబాద్ అంటే చాలు వాడికి దేహ శుద్ధి వెంటనే జరిగిపోతుంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ వక్రబుద్ధి, ఉగ్రవాదాన్ని పెంచి పోషించే దేశంగా భారతదేశ ప్రజలలో వారి ప్రాణాలను బలిగొంది. మొన్నటికి మొన్న పహల్గాం లో జరిగిన అరాచకానికి బదులుగా భారతదేశం ఆర్మీ త్రివిధ దళాధిపతుల సహకారంతో ఆపరేషన్ సింధు విజయవంతమైంది. స్వదేశంలో తయారుచేసిన క్షిపీనీల ద్వారా వివిధ ఆంటీ డ్రోన్స్ ద్వారా పాకిస్తాన్ దెబ్బకు తోక ముడిచింది. ఇది ఒకవైపు ఉంటే అసలు భాగ్యనగరంలో కరాచీ రగడ హైదరాబాద్ మొత్తం వ్యాపిస్తోంది. అసలు కరాచీ చరిత్ర ఆ ఒప్పందం ఏంటో మనం ఇప్పుడు ఒకసారి చూద్దాం. 1947 అంటే భారత విభజన జరిగినప్పుడు కరాచీ ప్రాంతం నుండి సింది వలసదారుడు కాం చంద్ రామ్నా అనే వ్యక్తి హైదరాబాదుకు వలస వచ్చాడు. 1953లో మొజ్జాంజా మార్కెట్లో మొట్టమొదటిసారిగా కరాచీ బేకరిని ఏర్పాటు చేశారు. అలా ఏర్పాటైన మొదటి బేకరీ నుంచి ఇప్పటికి హైదరాబాదు నగరంలో 23 శాఖలు ఉన్నాయంటే ఎంత విశ్వవ్యాప్తి చెందిందో మనకు అర్థం అవుతుంది.

కరాచీ ఒప్పందం భారతదేశం పాకిస్తాన్ మధ్య ప్రపంచం మరువలేని ఒక ఒప్పందం జరిగింది. కచ్చితంగా ఈ విషయాన్ని తెలుసుకోవాలి. ఎందుకంటే హైదరాబాదులో కరాచీ బేకరీపై పేరు మార్పు కోసం హైదరాబాదులో చేస్తున్న ఆందోళన కార్యక్రమాలు ఇవ్వాలా అనేక దారులకు తెరతీస్తున్న సందర్భంలో భారతదేశం పాకిస్తాన్ కరాచీ ఒప్పందం గురించి కచ్చితంగా ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన విషయం. 1948 ఆగస్టులో భద్రతా మండలి చేసిన తీర్మానం తో పాటు కాశ్మీర్ పోరాటాన్ని నిలిపివేయడానికి ఒక ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటు చేశారు. భారత్ పాకిస్తాన్ ల మధ్య మధ్యవర్తిత్వం చేయడం కోసం యు.ఎన్.సి.ఐ.పి ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కాల్పుల విరమణ సంధి కోసం నియమ నిబంధనలు ప్రజాభిప్రాయ సేకరణ చర్చలు ఈ భాగాల ద్వారా ఇరుదేశాలు ఈ తీర్మానాన్ని అంగీకరించాయి. 1948 డిసెంబర్ 31 వరకు ఈ కాల్పుల విరమణ జరిగింది.
1949 జులై 27 జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో కాల్పుల విరమణ రేఖను దానికి సంబంధించి భారత్ పాకిస్తాన్ సైనికుల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. భారత దేశం తరఫున జనరల్ ఎస్ఎం శ్రీ నగేష్ పాకిస్తాన్ తరుపున జనరల్జే కాతోర్న్ వీరితోపాటు యు.ఎన్.సి.ఐ.పి తరఫున ఫెర్నాండో షాంపర్ ఎం భారత ప్రతినిధి బృందం ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఇక ఇప్పుడు ఆ ఒప్పందాన్ని అతిక్రమిస్తూ ఆధీన రేఖను ఆక్రమిస్తూ పాకిస్తాన్ ఒక్కరు బుద్ధిని ప్రదర్శిస్తూ భారతదేశ యాత్రికులను పొట్టన పెట్టుకుంది. దీనికి సంబంధించి భారత దేశంలోని యువతి యువకులు ముఖ్యంగా హైదరాబాదులో ఉన్న యువత కరాచ బేకరీ అనే పేరు ఇక్కడ ఉండొద్దు అంటూ ఆందోళన కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నారు. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్న ఈ కథనం కరాచీ అని పేరు వినపడితేనే చాలు యువత ఆగ్రహ ఆవేశాలకు లోనవుతున్నారు. నిజానికి కరాచీ ఒప్పందాన్ని అతిక్రమించిన పాకిస్తాన్ ఇప్పుడు భారతదేశంలో అది భాగ్యనగరంలో ఆ పేరు ఉండడానికి వీల్లేదని ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీని ద్వారా భాగ్యనగరంలో ల్యాండ్ ఆర్డర్ సమస్యగా మారిపోతుంది. ఇప్పటికే యువత భారతదేశం చేస్తున్న యుద్ధంలో స్ఫూర్తిని పొంది దేశభక్తిని తను నిండా నింపుకున్న ఈ తరుణంలో ఇలాంటి సమస్యను పెద్దది కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన రక్షణ వ్యవస్థకు ఉంది. కాబట్టి వీలైనంత త్వరలో భాగ్యనగరంలో కరాచీ పై జరుగుతున్న ఆంధ్రుల కార్యక్రమాలను సద్దుమణిగేలా చేయాలి.



కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్ (జయభేరి),
తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఎడిటోరియల్
జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, కవి, గాయకుడు,
రచయిత, సామాజిక ఉద్యమకారులు



# బీఆర్ఎస్ లో చీలక

## తెలంగాణ షర్మిళ కవిత..

**జయభేరి, హైదరాబాద్, మే 18:**

బీఆర్ఎస్‌లో నాలుగు స్తంభాలాట నడుస్తోందని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. పది మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోతే బీఆర్ఎస్ ఎల్పీ చీలిపోతుందని తెలిపారు. మాజీ మంత్రి హరీశ్ రావు సహకారంతో బీఆర్ఎస్‌లో చీలిక రానుందని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కు షర్మిల తరహాలోనే ఇక్కడ కేటీఆర్‌కు కవిత తయారయ్యారని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. సొంత ఎజెండా పెట్టుకుని పని చేయకూడదని కేటీఆర్ చెప్పడం ఇందుకు నిదర్శనమని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం, స్పీకర్ సాయం కూడా ఇందుకు అవసరమని మహేశ్వర్ రెడ్డి అన్నారు. హరీశ్ రావు, కవితకు సహకరించేందుకు రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారని ఆరోపించారు. తండ్రి, కొడుకు, కూతురు, అల్లుడు మధ్య విభేదాలు ఉన్నాయని మహేశ్వర్ రెడ్డి చెప్పారు. రజతోత్సవ సభలో కేటీఆర్‌దే పెత్తనమని.. కవిత, హరీశ్ రావుకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదని అన్నారు. హరీశ్, కవిత డమ్మీగా మిగిలారని చెప్పారు. పలు కారణాలతో కేసీఆర్ క్రియాశీలకంగా ఉండటం లేదని తెలిపారు. సభలో కూడా అంత యాక్టివ్‌గా లేరని అన్నారు.తన తరువాత బీఆర్ఎస్ చీఫ్ కేటీఆర్ అని పరోక్షంగా ఇండికేషన్ ఇచ్చారని మహేశ్వర్ రెడ్డి చెప్పారు. డీఫాల్ట్ ప్రెసిడెంట్ గా కొనసాగుతున్నారని, కేసీఆర్ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని వ్యాఖ్యానించారు. సభలో తండ్రీకొడుకులు కీలకంగా వ్యవహరించారని, కవిత, హరీశ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. కవిత ఒంటరి అయ్యారని, ఆదిపత్య పోరు తారస్థాయికి చేరిందని మహేశ్వర్ రెడ్డి చెప్పారు. మహిళా సమానత, సామాజిక తెలంగాణ సాధన అంశంలో బీఆర్ఎస్ విఫలమైందని కవిత అన్న వ్యాఖ్యలు వ్యూహాత్మకమేనని అన్నారు. పదవులు, ఆస్తులు అన్ని కేటీఆర్‌కేనా అంటే లేఖాస్త్రంలో కవిత తిరుగుబాటు చేశారని తెలిపారు.కవిత కేసీఆర్ పదేళ్ల పాలనపై విమర్శలు చేస్తున్నారని మహేశ్వర్ రెడ్డి చెప్పారు. కేసీఆర్ కు రాసిన లేఖ త్వరలోనే బయటపెట్టే అవకాశం ఉందని అన్నారు. కేటీఆర్‌కే అన్ని ఇస్తుండటంతో కవిత తిరుగుబాటు జెండా ఎగురవేశారని చెప్పారు. తనను రాజకీయంగా అణిచి వేసేందుకు కేటీఆర్ కుట్ర చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారని తెలిపారు.మేడే రోజున తండ్రి పాలనా వైఫల్యాలు ఎండగట్టారని మహేశ్వర్ రెడ్డి చెప్పారు. తనను రెచ్చగొడితే మరింత రెచ్చిపోతానని చెప్పడం ఆమెలోని ఆవేదన బయటపడిందని అన్నారు. బీఆర్ఎస్‌లో ఒకే పవర్ సెంటర్ ఉండాలని కేటీఆర్ అభిమతమని అన్నారు. బీఆర్ఎస్ పై విమర్శలు చేసిన వెంటనే హరీశ్ రావు మీడియా సమావేశం పెట్టడం వెనక కేసీఆర్ హస్తం ఉందని చెప్పారు.పార్టీ అధ్యక్షుడు కేటీఆర్ అయితే ఎల్పీ నేత అవకాశం తనకు ఇవ్వాలని హరీశ్ రావు కండీషన్ పెట్టారని మహేశ్వర్ రెడ్డి అన్నారు. పదిమందిని తీసుకుని వేస్తే ఎల్పీ నేత అవకాశం ఇస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ఆరోపించారు. అందుకే హరీశ్ రావు దగ్గరికి కేటీఆర్ వచ్చి చర్చించారని అన్నారు. ఎల్పీతో పాటు అధ్యక్షుడిగా కూడా తానే ఉంటానని కేటీఆర్ చెప్పారని తెలిపారు. హరీశ్ రావు ఆలోచనలు మారిపోయాయని అన్నారు.ముందు వెళ్లిన పది మందికి తోడు మరో పదిమందిని తీసుకుని వస్తే ఎల్పీ నేత చేస్తానని హరీశ్‌కి రేవంత్ రెడ్డి చెప్పారని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఇదే జరిగితే కొంప మునుగుతుందని కేటీఆర్ భయపడ్డారని అన్నారు. హరీశ్ వెంట 13 మంది, కవితతో నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారని చెప్పుకొచ్చారు. ఇప్పటికే కాంగ్రెస్‌ను వీడిన పది మందిని కలుపుకుంటే మొత్తం 27 మంది అవుతారని, ఎల్పీ నేతను చేయడానికి సహకరిస్తానని హరీశ్‌తో సీఎం అన్నారని ఆరోపించారు

# మిస్ వరల్డ్ పోటీల ఫార్మాట్

# మే 31న ఫైనల్



**జయభేరి, హైదరాబాద్ :**

విశ్వనగరం హైదరాబాద్ మరో అరుదైన ఘనత సాధించింది. ఈ ఏడాది భాగ్యనగరం వేదికగా మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్.. ఈ పోటీల ఫార్మాట్‌ని వెల్లడించింది. హైదరాబాద్ వేదికగా జరుగుతున్న 72వ ప్రపంచ సుందరి పోటీల్లో.. సుమారు 108 దేశాల భామలు అందాల కిరీటం కోసం పోటీపడుతున్నారు. కంటెస్టెంట్లను ఇప్పటికే ఖండాల వారీగా గ్రూపులుగా విభజించారు. ఒక్కో ఖండం నుంచి 10 దేశాల పోటీదారులు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంటారు. వీరిలోంచి టాప్5ను ఎంపిక చేస్తారు. ఆ తర్వాత టాప్2 తీసుకుంటారు. ఇలా టాప్‌లో నిలిచిన వీరిలో ఒకరు ఆయా ఖండం తరఫున విజేత, మరొకరు రన్నరప్ అవుతారు. న్యాయనిర్ణేతలు ఒక్కో ఖండం నుంచి ఒక్కర్ని విజేతగా ప్రకటిస్తారు. ఆతర్వాత నాలుగు ఖండాల గ్రూపుల్లోంచి నలుగురు సుందరీమణులు చివరి రౌండ్‌కు చేరుకుంటారు. ఇక మిస్ వరల్డ్ ఫైనల్ ఈనెల 31న హైటెక్స్‌లో జరుగుతుంది. ఈ తుది రౌండ్ పోటీల్లో వీరిలోంచి అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన సుందరీమణిని మిస్ వరల్డ్‌గా ఎంపిక చేస్తారు. మిగతా ముగ్గుర్ని ఒకటి, రెండు, మూడో రన్నరప్‌గా ప్రకటిస్తారు. దీని కన్నా ముందు.. ఒక్కో ఖండం తరఫున మొదటి రన్నరప్‌గా నిల్చిన వారు.. ఫైనల్ రౌండ్ తర్వాత ఆయా ఖండాల విజేతలుగా ప్రకటిస్తారు. మిస్ వర్డల్ పోటీల్లో భాగంగా.. శనివారం నాడు క్రీడల ఛాలెంజ్ పోటీలు జరిగాయి. దీనిలో మిస్ వరల్డ్ ఎస్తోనియా ఎలిస్ రాండ్మా విజేతగా నిలిచి స్వర్ణ పతకం గెలుచుకున్నారు. అలానే మే 22న టాలెంట్ ఛాలెంజ్ ఫైనల్, 23న హెడ్ టూ హెడ్ ఛాలెంజ్ ఫైనల్, 24న మిస్ వరల్డ్ టాప్ మోడల్, 26న బ్యూటీ విత్ ఏ పర్పస్ ప్రాజెక్టుల ప్రదర్శన పోటీలు జరగనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం అంత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నది.
మిస్ వరల్డ్ 2025 పోటీల కోసం వివిధ దేశాల నుండి వచ్చిన అందాల భామలు.. ఇప్పటికే తెలంగాణలోని పలు చారిత్రక కట్టడాలను, దేవాలయాలను సందర్శించారు. ఈ క్రమంలో ఓ చిన్న సంఘటన వివాదాస్పదంగా మారింది. సుందరీమణులు రామప్ప దేవాలయాన్ని సందర్శన కోసం వెళ్లిన సమయంలో.. కొందరు మహిళా వాలంటీర్లు వారికి కాలు కడుక్కునేందుకు సాయం చేశారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో దీనిపై వివాదం రాజుకుంది. కొందరు దీన్ని సమర్థించగా.. మరికొందరు మన ఆడ బిడ్డల ఆత్మగౌరవాన్ని వాళ్ల కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని విమర్శించారు. దీనిపై మంత్రి సీతక్క ఘాటుగా స్పందించారు.

# మున్నేరు - పాలేరుకు లింక్ కెనాల్ కు రూ.162.54కోట్లు విడుదల

- వృధాగా సముద్రంలోకి పోతున్న వరద నీటిని రూపాయి ఖర్చు లేకుండా గ్రావిటీ కెనాల్ ద్వారా మళ్లింపు
- ముఖ్యమంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రి కి ప్రత్యేక కృతజ్ఞతలు
- రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**జయభేరి, పాలేరు :**



వృధాగా సముద్రంలోకి వెళ్తున్న మున్నేరు వాగు వరద నీటిని గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్ కు మళ్లించడానికి మున్నేరు పాలేరు లింక్ కెనాల్ కు రాష్ట్ర ప్రభుత్వం రూ.162.54 కోట్లు విడుదల చేసిందని రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి జీవో నెంబర్ 98 ని విడుదల చేయడం జరిగిందని తెలిపారు.
సముద్రంలోకి పోయే వరద నీటిని రూపాయి ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా మళ్లించాలన్న ఆలోచన ఈ రాష్ట్రాన్ని పదేళ్లు ఏలిన ప్రభుత్వానికి రాలేదని అన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల వృధాగా పోతున్న వరద నీటిలో సుమారు 10 టిఎంసిల వరద నీటిని పాలేరు రిజర్వాయర్ కు మళ్లించవచ్చని తెలిపారు. దీనివల్ల ఈ రిజర్వాయర్ పరిధిలో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని ఇందులో ఒక్క పాలేరు నియోజకవర్గంలోనే 1.30 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని తెలిపారు. పాలేరు లింక్ కెనాల్ కు నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలాగే ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.
సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు తాగునీరు, డోర్నకల్ నియోజకవర్గం పరిధిలో పది చెరువులకు సాగునీరు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతీ ఏటా వర్షాకాలంలో వస్తున్న వరద నీరు వృధా కాకుండా ఒడిసి పట్టాలనే సంకల్పం తో మున్నేరు నుంచి పాలేరుకు లింక్ కెనాల్ ను మంజూరు చేయించుకోవడం జరిగిందని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడించారు.

## జయభేరి సీనియర్ జర్నలిస్టు కడారి శ్రీనివాస్ కు అవార్డు పంట

**జయభేరి, న్యూస్ డెస్క్:**

ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ హైదరాబాద్ తెలంగాణ సంస్థ ద్వార, జయభేరిలో వస్తున్న విభిన్న రాజకీయ కథనాలను పరిశీలించిన యాజమాన్యం, గ్లోబల్ ఐకాన్ ఎక్సలెన్స్ అవార్డుకుగాను, జయభేరి సీనియర్ జర్నలిస్టు కడారి శ్రీనివాస్ కు జర్నలిస్టుగా లిరిక్ రైటర్, సింగర్ గా అవార్డు లభించింది.. ఈ సందర్భంగా కడారి శ్రీనివాస్ గతంలో జయభేరికి సంబంధించిన విభిన్న రాజకీయ విశ్లేషణ కథనాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఎడిటోరియల్ జర్నలిస్టుగా అవార్డు అందుకున్నాను. ఇప్పుడు గ్లోబల్ ఐకాన్ ఎక్సలెన్స్ అవార్డు 2025 కు ఎంపికైనందున చాలా సంతోషంగా ఉందని తెలిపారు... అవార్డు అందిస్తున్న యాజమాన్యానికి తెలియజేశారు. జూన్ మొదటి వారంలో రవీంద్ర భారతిలో ఈ అవార్డు ప్రధాన ఉత్సవం జరుగుతుందని స్నేహితుడు సన్నిహితులు ఆత్మీయులు వెల్విషర్స్ ప్రతి ఒక్కరు హాజరై ఆశీర్వదించాలని కోరారు...

## కరెంట్ షాక్ తో గేదె మృతి



**జయభేరి, గజ్వేల్, మే 18 :**

కరెంట్ షాక్ కొట్టి గేదె మృతిచెందిన ఘటన శనివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదిపూర్ గ్రామంలో జరిగింది. చాడ నర్సారెడ్డి రైతుకు చెందిన గేదె రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం వద్ద గేదె మేపుతున్నాడు మేసుకుంటూ వెళ్లి ట్రాన్స్ఫార్మర్ మేన్ వైర్ తగిలి ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. పాలు ఇచ్చే గేదే సుమారు 1 లక్ష రూపాయలు ఉంటుంది అని రైతు తెలిపాడు. తనకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని చాడ నర్సారెడ్డి కొరాడు.



## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి

**జయభేరి, దేవరకొండ :**

బీసీలను కులాల వారిగా కుల గణన చేసి గత అసెంబ్లీ జరిగిన ఎన్నికల్లో మేనిఫెస్టోలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పించి న్యాయం చేస్తామని కామారెడ్డి బహిరంగ సభలో ఎలక్షన్ మ్యానిఫెస్టోలో ఉంచి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య తో ప్రకటన చేయించారు. 16 నెలలు గడిచినప్పటికీ కుల గణన ప్రస్తావన లేకుండా పోవడం బీసీలకు తీవ్ర అన్యామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కుల గణన చేసి 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం దేవరకొండ నియోజకవర్గం ఉపాధ్యక్షులు ఇరగ దిండ్ల కృష్ణ అన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బీసీలకు పట్టించుకోకపోవడం అన్యాయమని చెప్పారు. తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు మేనిఫెస్టోలో ఉంచిన దానిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## అంబేద్కర్ చూపిన మార్గంలోనే నడవాలి

- తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరివాడు
- గద్దర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన లెజెండ్

**జయభేరి, ములుగు, మే 18:**



ప్రపంచ మేధావి అయినటువంటి భారత రాజ్యాంగ రచించినటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు ప్రజాయుద్ధ నౌక గద్దర్ మామిడాల గ్రామంలో విగ్రహ భూమి పూజ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్మన్ గుమ్మడివి వెన్నెల గద్దర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నిరంతరం బహుజన వర్గాల కోసం అహర్నిశలు కృషిచేసి భారత రాజ్యాంగాన్ని అందించినటువంటి గొప్ప మేధావి ప్రపంచ దేశాలే గుర్తిస్తున్నాయి, కానీ భారతదేశంలో ఎందుకు బహుజనులను చిన్న చూపు చూస్తున్నారని కేవలం అంబేద్కర్ అంటే ఒకే సామాజిక వర్గానికి పరిమితం కాకుండా అంబేద్కర్ అంటే అందరివాడు అని ఆయన కలలు కన్న సమ సమాజ స్థాపన కోసం కృషి దళిత బహుజనులు చదువుతోనే సాధ్యమవుతుందని అంటరానితనాన్ని రూపుమాపాలని ఇప్పటికి కూడా సమాజంలో మనిషిని మనిషిగా చూడడం లేదని అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసినటువంటి భారత రాజ్యాంగాన్ని ప్రజాయుద్ధ నౌక గద్దర్ అన్న రాజ్యాంగాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరిచి పాట,ఆట, మాట పోరాటాల పటిమతో దళిత బహుజనులను ఏకం చేసినటువంటి గద్దర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన లెజెండ్ గా మిగిలారు. ఈ కార్యక్రమంలో పి శంకర్, పోచబోయిన శ్రీహరి, యాదవ్, చిప్పల యాదగిరి, తుమ్మ శ్రీనివాస్, బండారు దేవేందర్ ,కొడకండ్ల నర్సింలు, నీరుడి స్వామి, కృపానందం, మంద పొందు, ఏఎంసీ చైర్మన్ వంటిమామిడి మోహన్, కాంగ్రెస్ నాయకులు తంబలి శ్రీనివాసు, ఎడ్ల పోచయ్య, కే భూపాల్ రెడ్డి బిఆర్ఎస్, ఎన్ సత్తయ్య పొట్ట అశోక్ కుమార్ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఎడ్ల సత్యం, జీడి కంటి స్వామి, పరమేష్, ఆనంద్ నందం, గణేష్ మల్లేశం, కృష్ణ, కరుణాకర్, శివకుమార్, బాబు అంబేద్కర్ వారసులు, తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల రామకృష్ణ చేతుల మీదుగా సన్మానం



**జయభేరి, దేవరకొండ :**

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా యాదగిరిగుట్టలోని ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల రామకృష్ణ చేతుల మీదుగా పూర్వ వాసవి క్లబ్ దేవరకొండ ప్రెసిడెంట్లు అయిన దామెర మురళి, నీల సంజీవ్ కుమార్ ను శాలువాలు, మెమంటోలతో ఘనంగా సన్మానించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సెక్రటరీ గార్లపాటి శ్రీనివాసులు, ఇంటర్నేషనల్ ట్రెజరర్ సుజాత రమేష్, ఇంటర్నేషనల్ వీఆర్వో కోటగిరి రామకృష్ణ డిస్టిక్ 104ఏ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, సెక్రటరీ బిక్కుమల్ల కృష్ణ, కోశాధికారి వెంపటి శబరీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసిల్దార్



**జయభేరి, తుర్కపల్లి, మే 18 :**

తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామం లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసిల్దార్ దేశ నాయక్ ఆదివారం పరిశీలించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం కొనుగోలు ధాన్యాన్ని పూర్తి చేయాలని, రాంపూర్ తండా గోదాంలో దిగుమతికి సిద్ధంగా ఉన్న 23 లారీలను త్వరగా దింపి లారీలను సెంటర్ వరకు పంపించాలని అధికారులను ఆదేశించారు .ఈ కార్యక్రమంలో సెంటర్ నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

## గంధ మల్ల రిజర్వాయర్ పై రైతులతో ప్రజాభిప్రాయ సేకరణ

**జయభేరి, తుర్కపల్లి, మే18:**




తుర్కపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ డివో కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తుర్కపల్లి మండలం గంధ మల్ల రిజర్వాయర్ పై గంధ మల్ల రైతులతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎవరికి అన్యాయం జరగకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారాన్ని అందజేస్తామని అన్నారు.
1.41 టీఎంసీల రిజర్వాయర్ కు సుమారు 1000 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంటుందని అన్నారు. అందుకోసం సుమారు 2000 మంది రైతుల భూములను సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులకు న్యాయమైన నష్టపరిహారాన్ని అందజేస్తుందని, రైతులు ఎలాంటి అపోహలు చెందవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ డి సి జయశ్రీ, తహసిల్దార్ దేశ నాయక్, డిప్యూటీ తహసిల్దార్ కల్పన, ఆర్ ఐ లు జహంగీర్, రఘు రామారావు, ఇరిగేషన్ శాఖ అధికారులు, గంధ మల్ల గ్రామ రైతులు పాల్గొన్నారు.

## కొమిరి ఎల్లమ్మ మృతి చాలా బాధాకరం

- కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి



**జయభేరి, గుడిపల్లి :**

గుడిపల్లి మండలం సింగరాజు పల్లి గ్రామానికి చెందిన కొమిరి కైలాసం భార్య ఎల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. కటిక నిరుపేద కుటుంబీకులైన వీరు వలస వెళ్లి జీవనం సాగిస్తారు. ఇట్టి విషయం తెలుసుకున్న కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఎల్లమ్మ మృతికి సంతాపం తెలియజేస్తూ దహన ఖర్చుల నిమిత్తం 5000 రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఇతను చేసిన ఆర్థిక సహాయానికి గ్రామస్తులు కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డిని అభినందించినారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్ర యాదగిరి గుడిపల్లి మండల యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్ యాదవ్ గ్రామానికి చెందిన పెద్దలు ఉన్నారు.

## చౌడేశ్వరి దేవి ఆలయంలో ఘనంగా అన్నదానం

**జయభేరి, తిరుపతి :**

శ్రీ చౌడేశ్వరి దేవి దేవస్థానం, తిరుపతి సత్యనారాయణపురం జ్యోతుల మహోత్సవం సందర్భంగా శనివారం మధ్యాహ్నం కీర్తిశేషులు మాలే వెంకటరత్నం జ్ఞాపకార్థంగా అన్న వితరణ జరిగింది. ఈ కార్యక్రమాన్ని వాళ్ళ కుమారులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కీర్తిశేషులు మాలే వెంకటరత్నం భార్య చౌడమ్మ, కుమారులు మాలే ప్రవీణ్ కుమార్, మాలే నాగేంద్ర కుమార్, మాలే యుగంధర్, మాలే రాంబాబు, మాలే హరికృష్ణ, మాలే మహేష్ పాల్గొన్నారు. తొగట వీర క్షత్రియ తిరుపతి జిల్లా అధ్యక్షులు మందపల్లి బాబు, గుడి కమిటీ సభ్యులు వెంకటకృష్ణ చంగల్ రాయులు సైతం పాల్గొన్నారు.

## 5 లక్షలు దాటిన డీఎస్సీ అప్లికేషన్స్

**జయభేరి, విజయవాడ, మే 18:**



ఆంధ్రప్రదేశ్లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్కు భారీగా స్పందన లభించింది. మొత్తం 3 లక్షల 35 వేల 401 మంది అభ్యర్థులు మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి దరఖాస్తు గడువు ముగిసింది. మెగా డిఎస్సీలో 16,347 పోస్టులను ఏపి ప్రభుత్వం భర్తీ చేయనుంది. ఈ మొత్తం పోస్టులకుగానూ 5 లక్షల 77 వేల 417 అప్లికేషన్లు వచ్చాయి. ఇతర రాష్ట్రాల నుంచి 7159 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 39,997 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యల్పంగా ఉమ్మడి కడప జిల్లా నుంచి 15వేల ఎనిమిది వందల పన్నెండు మంది అభ్యర్థులు డిఎస్సి పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. మే నెలాఖరు నుంచి హాల్ టికెట్లు జారీ చేయాలని విద్యాశాఖ చర్యలు చేపట్టింది. జూన్ 6న ప్రారంభం కానున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జూలై ఆరో తేదీన ముగియనున్నాయి. మే 20 నుంచి మెగా డీఎస్సీ అభ్యర్థులకు మాక్ టెస్టులు అందుబాటులోకి రానున్నాయి. మే 30 నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అన్ని పరీక్షలు పూర్తయిన రెండో రోజే ప్రాథమిక కీ విడుదల చేయనుంది విద్యాశాఖ. ఆ తర్వాత 7 రోజుల పాటు అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించనుంది. అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన వారం రోజుల తర్వాత ఏపీ మెగా డీఎస్సీ ఫైనల్ కీ విడుదల చేస్తారు. ఫైనల్ కీ విడుదల చేసిన 7 రోజుల తర్వాత ఏపీ డీఎస్సీ ఫలితాలు మెరిట్ జాబితా విడుదల చేస్తారు. తరువాత సర్టిఫికెట్ వెరిఫికేట్ వెరిఫికేసన్ ప్రక్రియ పూర్తిచేసి, రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా ఆయా పోస్టులకుగానూ అభ్యర్థుల తుది ఎంపిక పూర్తి చేసి ఫలితాలు ప్రకటించనున్నారు.





# బ్రహ్మోస్ తో చైనాలో వణుకు

భారత సైన్యం ఇటీవల ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. తర్వాత పాకిస్థాన్ ప్రయోగించిన తుర్కియే డ్రోన్లు, చైనా లాంఛర్లను కూడా మన ఎస్400 తునాతునకలు చేసింది. దీంతో పాకిస్థాన్ అమెరికాను శరణు కోరింది. ఇదే సమయంలో భారత సైనిక శక్తిని చూసిన డ్రాగన్ దేశం చైనా ఉలిక్కిపడింది. దీంతో మన సైనిక రహస్యాలు తెలుసుకునేందుకు దొడ్డిగారిన ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో భారత జలాల సమీపంలో చైనాకు చెందిన గూఢచారి నౌక 'డా యాంగ్ యీ హావ్' కదలికలు అనేక అనుమానాలకు తావిచ్చాయి. ఈ నౌక హైడ్రోగ్రాఫిక్ సర్వేల పేరుతో భారత నౌకాదళ కదలికలను, జలాంతర్గాముల రాకపోకలను నిశితంగా గమనిస్తోందని, చైనాపాకిస్థాన్ రాజకీయ సహకారాన్ని సూచిస్తోందని ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఈ నౌక కదలికలు భారత్‌కు సవాల్‌గా మారడమే కాకుండా, హిందూ మహాసముద్రంలో చైనా యొక్క వ్యూహాత్మక ఆసక్తులను కూడా బయట పెడుతున్నాయి.డా యాంగ్ యీ హావ్ ఒక భౌగోళిక, భౌతిక సర్వే నౌకగా చైనా పేర్కొన్నప్పటికీ, దీనిని భారత్‌తో సహా అనేక దేశాలు గూఢచార నౌకగా పరిగణిస్తున్నాయి. ఈ నౌక అధునాతన సెన్సర్లు, హైడ్రోగ్రాఫిక్ పరికరాలతో సముద్ర గర్భంలోని భౌగోళిక నిర్మాణాలను మ్యాప్ చేయగలదు, జలాంతర్గాముల కదలికలను గుర్తించగలదు. మిసైల్ పరీక్షల సమాచారాన్ని సేకరించగలదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ నౌక భారత జలాల సమీపంలో మలక్కా జలసంధి నుండి శ్రీలంక దక్షిణం వైపు కదలడం గమనార్హం. ఈ కదలికలు భారత నౌకాదళం యొక్క ప్రతిస్పందన సామర్థ్యాన్ని, ఐఎన్ఎస్ విక్రాంత్ వంటి యుద్ధ నౌకల కదలికలను పసిగట్టే ప్రయత్నంగా భావిస్తున్నారు.చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ లో భాగమైన చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ పాక్ ఆక్రమిత కశ్మీర్ మీదుగా నిర్మాణంలో ఉంది. ఈ ప్రాజెక్టుపై భారత్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఇది భారత సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తుందని భావిస్తోంది. సీపీఈసీ విజయవంతంగా అమలు కావాలంటే, పాకిస్థాన్‌లో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక బలం అవసరం, ఇది చైనాకు కీలకం. డా యాంగ్ యీ హావ్ కదలికలు ఈ ప్రాజెక్టు భద్రత కోసం సమాచార సేకరణలో భాగంగా ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నౌక సేకరించిన సమాచారం పాకిస్థాన్‌లోని జివానీ, గ్వాదర్ లేదా జిబౌటీ వంటి ప్రాంతాల్లో చైనా నిర్మించాలనుకుంటున్న సైనిక లాజిస్టిక్స్ బేస్‌కు ఉపయోగపడవచ్చు.ఆపరేషన్ సిందూర్ తర్వాత, భారత నౌకాదళం అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రంలో అత్యంత అప్రమత్తంగా ఉంది. ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో సమాయత్తమైన యుద్ధ నౌకలు, జలాంతర్గాములు మోహరించబడ్డాయి. ఈ సందర్భంలో చైనా గూఢచారి నౌక కదలికలు భారత నౌకాదళ కమ్యూనికేషన్‌లను అడ్డుకోవడానికి, జలాంతర్గాముల రాకపోకలను ట్రాక్ చేయడానికి ఉపయోగపడవచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భారత నౌకాదళం ఈ కదలికలను నిశితంగా గమనిస్తూ, ఏదైనా దాడిని తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉంది.చైనా హిందూ మహాసముద్రంలో తన సైనిక, ఆర్థిక ప్రాబల్యాన్ని పెంచేందుకు నిరంతరం ప్రయత్నిస్తోంది. డా యాంగ్ యీ హావ్ వంటి నౌకలు సముద్ర గర్భంలోని ఖనిజ వనరులను, సముద్ర జలాల స్వభావాన్ని అధ్యయనం చేస్తూ, చైనా నౌకాదళం జలాంతర్గామి యుద్ధ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి సమాచారం సేకరిస్తున్నాయి. ఇవి భారత్‌తోపాటు ఇతర దేశాల సైనిక కదలికలను గమనించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఆపరేషన్ సింధూర్‌పై భారత్‌కు వ్యతిరేకంగా , పాకిస్తాన్‌కు అనుకూలంగా తప్పుడు ప్రచారం చేశాయి టర్కీ , చైనా మీడియా సంస్థలు. అందుకే భారత్ కఠిన చర్యలు తీసుకుంది. పేర్లను మార్చేందుకు గతంలోనూ చైనా ప్రయత్నాలు చేసింది. 2017 నుంచి ఇప్పటికి నాలుగు సార్లు ఇలా కొన్ని ప్రాంతాల పేర్లు మార్చుతూ వచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో భాగమే అంటూ మరోసారి స్పష్టం చేసిన కేంద్రం.. ఇలా భారత భూభాగాల పేర్లు, మ్యాప్‌లు మార్చే హక్కు చైనాకు లేదని కౌంటర్ ఇచ్చింది. అంతర్గత భద్రతపై సమావేశంలో చైనా గ్లోబల్ టైమ్స్‌పై కూడా నిషేధం విధించినట్టు అమిత్‌షా ప్రకటించారు.అధునాతన టెక్నాలజీని ఉపయోగించడం తోనే ఆపరేషన్ సింధూర్ విజయవంతమయ్యిందన్నారు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్. 10 శాటిలైట్ల సాయంతో ఆపరేషన్ సింధూర్ పూర్తి చేశారు. దీంతో ప్రపంచానికి భారత్ సత్తా తెలిసిందన్నారు అశ్విని వైష్ణవ్. యూపీ లోని జేవర్‌లో సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. యూపీలో తొలి సెమీ కండక్టర్ యూనిట్ కాగా దేశంలో ఇది ఆరో యూనిట్ అని తెలిపారు.మరోవైపు భారత్ అమ్ముల పొది మరో అస్త్రం చేరింది. యాంటీ డ్రోన్ సిస్టమ్ భార్గవాస్త్రను విజయవంతంగా ప్రయోగించారు. ఒడిశా లోని గోపాలపురం తీరంలో ఈ ప్రయోగం జరిగింది. గాలి లోనే డ్రోన్లను ధ్వంసం చేసే వ్యవస్థను సోలార్ డిఫెన్స్ సిస్టమ్ తయారు చేసింది. మరోవైపు పాకిస్తాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను భారత్ జామ్ చేసింది. 23 నిముషాల పాటు పాక్‌కు చైనా ఇచ్చిన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను జామ్ చేసింది.2024లో యువాన్ వాంగ్6, జియాంగ్ యాంగ్ హాంగ్03 వంటి ఇతర చైనా నౌకలు హిందూ మహాసముద్రంలో కదలికలను గమనిస్తే, చైనా ఈ వ్యూహం దీర్ఘకాలికమని స్పష్టమవుతుంది.చైనా గూఢచారి నౌక కదలికలు పాకిస్థాన్‌కు మద్దతుగా సంకేతాలను పంపేందుకు, భారత్ యొక్క సైనిక సన్నాహాలను ముందుగా గుర్తించేందుకు ఉద్దేశించినవిగా భావిస్తున్నారు. ముఖ్యంగా, కరాచీ లేదా గ్వాదర్ వంటి పాకిస్థాన్ యొక్క వ్యూహాత్మక ప్రాంతాలపై భారత్ దాడి చేసే అవకాశం ఉంటే, ఈ నౌక సేకరించిన సమాచారం పాకిస్థాన్‌కు హెచ్చరికగా ఉపయోగపడవచ్చు. ఇది చైనాపాకిస్థాన్ సైనిక సహకారాన్ని మరింత బలోపేతం చేసే అంశంగా కనిపిస్తుంది. మరో వైపు పహల్గాంలో ఏప్రిల్ 22వ తేదీన జరిగిన దాడిలో ఉగ్రవాదులు 26 మంది పర్యాటకుల ప్రాణాలు తీశారు. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ భారత్.. ఈ దాడి చేసింది పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులేనని గుర్తించింది. దీంతో అటు దౌత్యపరంగా ఇటు సైనిక పరంగా చర్యలు చేపట్టింది. ముఖ్యంగా సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇక అప్పటి నుంచి పాకిస్థాన్‌కు నీళ్లు వెళ్లకుండా చేస్తోంది. అయితే ఈ ఒప్పందం రద్దు తర్వాత పాకిస్థాన్ మంత్రులంతా భారత్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యంగా పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. భారత్ నీళ్లను ఆపేస్తే తామేమీ ఊరుకోమని, యుద్ధం చేస్తామని హెచ్చరించారు. అలాగే ఈ నదిపై నిర్మాణాన్ని అయినా బాంబులు పెట్టి పేల్చేస్తామని అన్నారు. పీపీపీ చైర్మన్ బిలావల్ భుట్టో ఏమన్నారంటే.. సింధు నదిలో పాకిస్థాన్ నీళ్లైనా పారాలి లేదా భారతీయుల రక్తమైనా పారాలంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇలా ఒక్కొక్కరూ ఒక్కో విధంగా భారత్‌ను భయపెట్టే ప్రయత్నం చేశారు.

# ఈ ఖరీదైన చదువు "కొనలేం"

## రెక్కాడితే డొక్కాడనోళ్ళం



- ప్రాథమిక విద్యకే లక్షలాది ఫీజులు
- ప్రైవేట్ బడుల్లో నామమాత్రపు సౌకర్యాలు
- ఫీజులు తగ్గించాలంటు తల్లిదండ్రుల వేడుకోలు
- చేష్టలుడిగి చూస్తున్న విద్యాశాఖ అధికారులు
- ప్రైవేట్ దోపిడీపై చర్యలకు వెనకాడుతున్న పాలకులు

**జయభేరి, హైదరాబాద్ :**




ఒక పేద వాడు నెల అంతా కష్టపడి గొడ్డు చాకిరి చేస్తే పట్టుమని 10,000 దాటని సంపాదనతో ఇటు ఇల్లు గడపడమా? అటు పిల్లలను చదివించడమా అని నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లోని పేద తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. ఒకనాడు 300 పెడితే ఇంటికి సరిపడా నెల గాసమంతా వచ్చేది, కానీ నేడు పెరిగిన ధరల వల్ల నెల అంతా కష్టపడి సంపాదించిన జీతంలో సగానికి పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వాలు సర్కారు విద్యను నిర్లక్ష్యం చేయడంతో ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయింది. వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారైంది. ప్రాథమిక విద్యకి లక్షలాది రూపాయల ఫీజులను తల్లిదండ్రుల నుండి ముక్కు పిండి వసూలు చేస్తుండం నేడు తెలుగు రాష్ట్రాల్లో కనబడుతోంది. ఒక పూట ఉపవాసం ఉన్నా పర్వాలేదు కానీ, తమ పిల్లలను ప్రయోజకులను చేయాలనే ఆకాంక్షలతో తల్లిదండ్రులు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రైవేట్ బడులకే పంపిస్తున్నారు. దీన్నే ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ పాఠశాలలు కనీస తరగతి గదులు, మరుగుదొడ్లు, ఆట స్థలాలు ఇలా కనీస సౌకర్యాలు కల్పించకుండా, అర్హత గల స్టాఫ్ ను నియమించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని అక్కడక్కడ తల్లిదండ్రులు నిలదీస్తున్నప్పటికీ వారిని తేలికగా తీసుకుంటూ వారి వ్యాపారాలను మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చేసుకుంటున్నారు. విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు అక్కడక్కడ వీరి అనారోగ్యకర పోకడలకు అడ్డు కళ్లెం వేయడానికి ప్రయత్నాలు చేస్తున్న వారినీ మచ్చిక చేసుకుని వారి అక్రమ సామ్రాజ్యాన్ని కొనసాగిస్తున్నారు. అక్కడక్కడ కొన్ని విద్యార్థి, ప్రజా సంఘాలు సైతం ప్రైవేట్ యాజమాన్యాలపై రాజీలేని ఉద్యమాలు కొనసాగిస్తున్నారు. ఇలా గట్టిగా ఉద్యమస్తున్న ప్రాంతాల్లో, విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ యాజమాన్యాలకు దాసోహం అంటున్నారు. దీంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవలసిన సంబంధిత అధికారులే చేష్టలుగి అస్త్ర సన్యాసం చేస్తే మా గోడు చెప్పుకునేది ఎవరికని తెలుగు రాష్ట్రాల్లోని నిరుపేద తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రవేట్ స్కూల్ యాజమాన్యాల దోపిడి బహిరంగ రహస్యమే అని చెప్పవచ్చు. ఈ బహిరంగ దోపిడికి ప్రతిఫలంగా, ప్రతి ఏటా వందల కోట్ల రూపాయలు వారి జేబులు నింపుకుంటున్నారని చెప్పవచ్చు. ఈ తతంగమంతా అధికారంలో ఉన్న అన్ని ప్రభుత్వాలకు తెలిసినప్పటికీ , ప్రభుత్వాలు సైతం వారిని ఏమి చేయలేక చేష్టలుడిగి చూస్తుందని చెప్పవచ్చు. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాల్లోని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులు ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా, వారికి చిత్తం వచ్చినట్లుగా ఫీజుల పట్టికలను తయారు చేయించుకోకుండా, ప్రభుత్వ అధికారులతో ఒక కమిటీని వేసి ఫీజులను నిర్వహించాలని రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

# దుర్గగుడిలో అడగడుగునా దోపిడీ

**జయభేరి, విజయవాడ, మే 18:**



బెజవాడ దుర్గమ్మ.. ఎంతోమందికి ఆరాధ్య దైవం. అమ్మవారి దర్శనం కోసం ఏపీలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా.. వేరే రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. కానీ.. అమ్మవారి సన్నిధిలో దోపిడీ చూశాక ముక్కున వేలేసుకుంటున్నారు. కొండపైకి వెళ్లడం మొదలు.. కిందకు వచ్చేదాకా భక్తులను దారుణంగా దోచుకుంటున్నారు.విజయవాడ ఇంద్రకీలాద్రి.. ఎంతో పవిత్రమైన పుణ్యక్షేత్రం. కానీ ఇప్పుడు దోపిడీకి కేంద్రంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా అక్కడ వ్యాపారులు, సిబ్బంది భక్తుల జేబులకు చిల్లు పెడుతున్నారు. కొండపైకి ఎక్కడం మొదలు.. కిందకు దిగే వరకు.. ప్రతీచోట డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.అమ్మవారి కొండపైకి వెళ్లడానికి ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. కానీ.. అవి సరిపడా లేవు. ఎప్పుడో వస్తున్నాయి. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో.. భక్తులు వేడికి తాళలేక.. ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వారధి కింద నుంచి కొండపైకి వెళ్లడానికి సెవెన్ సీటర్ వాహనాలను నడుపుతున్నారు. వీటిల్లో ఎక్కించడానికి అక్కడ విధులు నిర్వహించే ఆలయ సిబ్బంది సహకరిస్తున్నారు. అటు ఘాట్ రోడ్డు ప్రారంభంలో ఉండే సిబ్బంది కూడా.. భక్తుల వాహనాలకు ఆంక్షలు పెడుతున్నారు. కానీ.. కొండపైకి వచ్చే ప్రైవేటు వాహనాలను మాత్రం ఆపడం లేదు. వీటిల్లో ఒక్కో భక్తుడి నుంచి రూ.20 వసూలు చేస్తున్నారుఏదోలా కొండపైకి వచ్చిన భక్తులు.. అక్కడా దోపిడీకి గురవుతున్నారు. సాధారణంగా రూ.20 ఉండే వాటర్ బాటిల్‌ను రూ.30కి విక్రయిస్తున్నారు. ఇందేటని ప్రశ్నిస్తే.. ఇష్టం ఉంటే కొనుక్కో.. లేదంటే లేదు.. అని గద్దిస్తున్నారు. కూల్ డ్రింక్స్ విక్రయాల పరిస్థితి గురించి చెప్పాల్సిన అవసరం లేదు. కొండపైన ఫొటోలు తీసేవారు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారు.గతంలో మాదిరిగా కాకుండా.. అమ్మవారి కొండపైకి ఎక్కడానికి లిఫ్ట్ ఏర్పాటు చేశారు. వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలు, వారి తల్లిదండ్రులను లిఫ్ట్‌లో పైకి తీసుకెళ్లాలి. కానీ.. అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. డబ్బులు వసూలు చేసి.. లిఫ్ట్‌లో ఎక్కిస్తున్నారనే ఆరోపమలు ఉన్నాయి. ఇటు కొండపైనుంచి కిందకు దిగడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భక్తులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో బస్సులు సరిపోవడం లేదు. దీంతో ప్రైవేటు వాహన యజమానులు అక్కడికి వచ్చి.. భక్తులకు మాయమాటలు చెప్పి.. వాహనాల్లో ఎక్కిస్తున్నారు.ఇలా ప్రతీచోట.. భక్తులు దోపిడీకి గురవుతున్నారు. అక కొండపైకి ఎక్కాక.. గతంలో మాదిరిగా లేదు. ఏది ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. దర్శనం తర్వాత భక్తులు బయటకు రావడానికి కూడా సరైన మార్గం లేదు. లడ్డూ ప్రసాదం ఎక్కడ విక్రయిస్తారో తెలియక చాలామంది నిరాశతో వెనుదిరుగుతున్నారు. సిబ్బందిని అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోతున్నారు.భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పిస్తారు. ఇక్కడైతే.. మామూలు దోపిడీ లేదు. ఒక్కో భక్తుడి దగ్గర ఆలయ అధికారులు రూ.40 తీసుకొని టోకెన్ ఇస్తున్నారు. కానీ.. తీరా అక్కడికి వెళ్లాక రూ.100 ఇస్తేనే తలనీలాలు తీస్తున్నారు. ఇవ్వకపోతే.. బూతులు తిడుతున్నారు. ఆగమాగం తలనీలాలు తీస్తున్నారు. పుట్టు వెంట్రుకలు అయితే.. ఇంకా ఎక్కువ వసూలు చేస్తున్నారు.

# ఎన్ ఆర్ ఐలకు అమెరికా షాక్

**జయభేరి, హైదరాబాద్, మే 18:**



NRIలకు అమెరికా మరో బిగ్ షాక్ ఇవ్వబోతుంది. అమెరికా పార్లమెంటులో కొత్త బిల్లు ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమవుతోంది డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం. రిపబ్లిక్ పార్టీ కొత్తగా ఒక పన్ను చట్టాన్ని తీసుకురావాలని చూస్తోంది. ఇదే జరిగితే అమెరికాలోని లక్షలాది మంది భారతీయులకు పెద్ద ఎదురుదెబ్బ.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ది వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్' పేరుతో కొత్త పన్ను చట్టాన్ని తీసుకురావాలని భావిస్తున్నారు. అమెరికాలో ఉన్న విదేశీయులు, ముఖ్యంగా భారతీయులు పంపే నగదు బదిలీలపై 5 శాతం పన్ను విధించాలని ఆయన సూచించారు. ఈ కొత్త రెమిటెన్స్ పన్ను ప్రతిపాదన ప్రస్తుతం అమెరికా ప్రతినిధుల సభలో బిల్లుగా ప్రవేశ పెడతారు. ఇది అమల్లోకి వస్తే, అమెరికాలో పనిచేస్తున్న H1బీ వీసాదారులు, గ్రీన్ కార్డు కలిగినవారు, తాము పంపే డబ్బుపై 5 శాతం అదనపు భారం మోపాల్సి వస్తుంది.రియల్ ఎస్టేట్, విద్య, వైద్య ఖర్చుల కోసం తమ దేశానికి డబ్బు పంపే డబ్బులపై భారీగా భారం పడనుంది. అమెరికాలో ఉన్న భారతీయులు.. స్వదేశంలో ఉన్న తమ వారికి 11వందల 60 డాలర్లు అనగా దాదాపు రూ.లక్ష పంపిస్తే, అందులో ఐదు శాతం.. రూ.5వేలను పన్నుగా చెల్లించాలి. హెచ్1బీ, ఎఫ్1 లేదా జే1 వీసాదారులు, గ్రీన్ కార్డుదారులు, తగిన గుర్తింపు పత్రాలు లేనివారు నగదు బదిలీలు చేసినప్పుడు ఈ పన్ను చెల్లించాల్సిందే..! అమెరికా పార్లమెంటులో సమర్పించబోయే ఈ కొత్త బిల్లు 389 పేజీల పొడవు ఉంది. పేజీ నంబర్ 327లో ఒక లైన్ రాసి ఉంది. అమెరికా పౌరుడు కాకపోతే, US వెలుపలకు పంపిన డబ్బుపై 5 శాతం పన్ను విధించడం జరుగుతుంది.ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం, రెమిటెన్స్ రూపంలో అత్యధికంగా ఆదాయం పొందే దేశంగా భారత్ 2008 నుంచి మొదటిస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుత ఏడాది ప్రపంచ మొత్తం రెమిటెన్స్‌ల లో 14 శాతం భారత్‌కు వచ్చిందని అంచనా. అమెరికా ప్రభుత్వ నిర్ణయం, లక్షలాది మంది భారతీయ ప్రవాసులకు ఆర్థికంగా కొత్త భారంగా మారే అవకాశముంది.ఇది ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. అమెరికాలో దాదాపు 45 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది H1B లేదా L1 వీసాపై, గ్రీన్ కార్డ్ హోల్డర్లు ఉన్నారు. ఈ వ్యక్తులు ప్రతి నెలా ఇంటికి డబ్బు పంపుతారు. కొన్నిసార్లు వారి తల్లిదండ్రుల మందుల కోసం, కొన్నిసార్లు వారి సోదరి, సోదరుల చదువు కోసం, కొన్నిసార్లు ఎవరికైనా వివాహానికి సహాయం చేయడానికి.. ఇలా పంపించే వాటన్నింటిపై ట్రంప్ ప్రభుత్వం పన్ను విధించబోతోంది.202324 సంవత్సరంలో, భారతదేశం అమెరికా నుండి 32 బిలియన్ డాలర్ల రెమిటెన్స్‌ను అందుకుంది. దీనిపై మనం 5% పన్ను విధిస్తే, భారతీయులు ఏటా దాదాపు 1.6 బిలియన్ డాలర్ల అదనపు భారాన్ని మోయవలసి ఉంటుంది. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీరు రూ. 5,000 లేదా రూ. 5 లక్షలు పంపినా, ప్రతి బదిలీపై ఈ పన్ను విధించడం జరుగుతుంది. మే 26 నాటికి అమెరికా ప్రతినిధుల సభలో బిల్లు ఆమోదం పొందేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. జూలై 4 (అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం) నాటికి దీనిని చట్టంగా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతాయి. అంటే, అది ఆమోదం పొందితే, జూలై నుండే డబ్బు పంపడంపై 5% పన్ను ప్రారంభమవుతుంది.




# నా మీద నా సేవల మీద పెట్టిన నమ్మకం వృధా చేయను

**జయభేరి, తిలక్ నగర్:**

లోకాసంస్థ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ LHRPCIL ఆధ్వర్యంలో హైదరాబాద్ అబిడ్స్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సమావేశం సందర్భంగా ఈరోజు సంస్థ నేషనల్ చైర్మన్ & ఫౌండర్ G. P నర్సింహులు చేతులు మీదుగా యక్కలూరు వరలక్ష్మి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా మహిళా విభాగం (women wing) Executive మెంబర్ గా ID కార్డుతో బాధ్యతలు అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వరలక్ష్మి జయభేరి తో మాట్లాడుతూ... చాలా సంతోషకారంగా ఉంది.... నా మీద నా సేవల మీద పెట్టిన నమ్మకం వృధా చేయకుండ కర్తవ్యం నెరవేరుస్తాను అందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదములు తెలియజేశారు.

# పుట్టుకతోనే ప్రతి ఒక్కరు స్వేచ్ఛ




**జయభేరి, తిలక్ నగర్:**

లోక సమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ సంస్థ ఫౌండర్ అండ్ నేషనల్ చైర్మన్ జి.పి. నరసింహులు ఆధ్వర్యంలో ప్రజల ప్రాథమిక హక్కుల గురించి అవగాహన కార్యక్రమం స్థానిక హైదరాబాద్ పట్టణంలోని అబిడ్స్,రామకోటి తిలక్ రోడ్డులో గల విశ్వకర్మ బాయ్స్ హాస్టల్ నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజల ప్రాథమిక హక్కుల గురించి పలు విషయాల పైన చర్చించడం జరిగింది. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజల ప్రాథమిక హక్కులలో భాగంగా పుట్టుకతోనే ప్రతి ఒక్కరు స్వేచ్ఛ, స్వాతంత్రం హక్కులు కలిగి ఉంటారని తెలియజేయడం జరిగింది. సంస్థ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా మానవ హక్కులపై అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలుపడం జరిగింది. లోకాసమస్త హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర విభాగ, హైదరాబాద్ సిటీ విభాగ సభ్యులు పలువురు మానవ హక్కుల పరిరక్షణ గురించి మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో గాయకులు పలు జానపద గాయాలు ఆలపించి సంస్థ సభ్యులను ఉత్తేజ పరచడం జరిగింది.తదనంతరం సంస్థ సభ్యులకి గుర్తింపు కార్డులు ఇవ్వడం జరిగింది.

జయభేరి సినిమా
05
19-05-2025
సోమవారం
jayabheridaily.com



## అరవైలో ఇరవైలా.. విరిసిన వరమాల..

ప్రేమ, రక్తబంధాల నేపథ్యంలో రూపొందిన కుటుంబకథా చిత్రం 'షష్టిపూర్తి'. నాటి 'లేడీస్‌టైలర్' జంట రాజేంద్రప్రసాద్, అర్చన ఇందులో కీలక పాత్రలు పోషించారు. రూపేష్, ఆకాంక్ష సింగ్ హీరోహీరోయిన్లు. పవన్‌ప్రభ దర్శకత్వంలో రూపేష్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 30న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే గత కొన్ని రోజులుగా ఈ సినిమా ప్రమోషన్స్‌ని మేకర్స్ వేగవంతం చేశారు. ఇళయరాజా స్వరపరిచిన ఈ చిత్రం పాటలను ఒక్కొక్కటిగా విడుదల చేస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే కథానుగుణంగా 'షష్టిపూర్తి' రోజు వచ్చే గీతాన్ని మేకర్స్ రిలీజ్ చేశారు. 'వేయి వేణువులనాదం మోగే హాయి హాయి హృదయాన.. ప్రేమ మంత్రముల గానం సాగే ఈ ముహూర్త సమయాన.. సరదాలే సరిగమలై పలికిన శుభవేళ.. అరవైలో ఇరవైలా విరిసిన వరమాల..' అంటూ సాగే ఈ పాటను చైతన్యప్రసాద్ రాయగా, కార్తీక్, విభావరి ఆప్టే జోషి కలిసి ఆలపించారు.
స్వర్ణ మాస్టర్ ఈ గీతానికి నృత్య రీతుల్ని సమకూర్చారు. ఇళయరాజా సంగీతం ఈ సినిమాకు హైలైట్ కానున్నదని, ఇకపై ఎవరు 'షష్టిపూర్తి' జరుపుకున్నా ఈ పాటను ప్లే చేసి తీరాల్సిందేనని, ఈ పాటకోసం లెజెండ్రీ కళాదర్శకుడు తోటతరణి నిర్మించిన మండువ లోగిలి సెట్ అద్భుతమైన అనుభూతికి లోను చేస్తుందని, రాజేంద్రప్రసాద్, అర్చన, రూపేష్, ఆకాంక్ష సింగ్‌లపై చిత్రీకరించిన ఈ పాట సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కానున్నదని మేకర్స్ తెలిపారు. 'కాంతార'ఫేం అచ్యుత్‌కుమార్, సంజయ్ స్వరూప్, తెనాలి శకుంతల, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: రామ్, నిర్మాణం: మా ఆయి ప్రొడక్షన్స్.

## డబ్బింగ్ పూర్తవ్వగానే యాక్షన్



ఫారిన్ ట్రిప్ ముగించుకొని ఇటీవలే ఇంటికి చేరుకున్నారు ప్రభాస్. అడుగుపెట్టి పెట్టగానే.. 'ది రాజాసాబ్' డబ్బింగ్ పనుల్లో బిజీ అయిపోయారాయన. ప్రభాస్ డబ్బింగ్ పార్ట్ ఈ వారంలో పూర్తవుతుందని 'ది రాజాసాబ్' వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే సినిమా విడుదల డేట్‌ని కూడా ప్రకటిస్తారట. మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.
ఇదిలావుంటే.. 'ది రాజాసాబ్' డబ్బింగ్ పూర్తి చేసిన వెంటనే హను రాఘవపూడి 'ఫౌజీ' సెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు ప్రభాస్. 45రోజుల పాటు జరిగే ఈ భారీ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారట. దీంతో చాలావరకూ ఈ సినిమా షూటింగ్ పూర్తవుతుందని తెలుస్తున్నది. ఇమాన్వి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీమూవీమేకర్స్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



## వింత సమస్యతో..

పాయల సోషల్ మీడియాలోను చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తనకు సంబంధించిన పర్సనల్, ప్రొఫెషనల్ విషయాలు షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా కంటి సమస్యతో బాధపడుతున్నట్టుగా చెప్పుకొచ్చింది. తన కంటికి ఏమీ కూడా సరిగ్గా కనిపించడం లేదట. అలా హెల్త్ బాగా లేకపోయినా కూడా ఇచ్చిన కమిట్మెంట్ కోసం ఓ పెనింగ్ ఈవెంట్ కోసం వెళ్లిందట. తన కంటికి మాత్రం అన్నీ రెండు రెండుగా కనిపిస్తున్నాయట. అక్కడ ఎలా మేనేజ్ చేస్తానో. ఈ కళ్ల అద్దాలతో అయితే కవర్ చేశాను అంటూ పాయల్ చెప్పుకచ్చింది. ఈ అమ్మడికి ఏ సమస్య వచ్చిందో తెలియక అభిమానులు కూడా కంగారు పడుతున్నారు. ఇక పాయల్ ప్రస్తుతం సరైన అవకాశం, సక్సెస్ కోసం చూస్తోంది. ఆర్‌ఎక్స్ 100 తరువాత అవకాశాలు బాగానే వచ్చిన కూడా అవన్నీ సక్సెస్ కాలేకపోయాయి. . చివరకు మంగళవారం అంటూ మళ్లీ అజయ్ భూపతి వల్లే హిట్టు దొరికింది. అలా చాలా ఏళ్లకు మళ్లీ మంగళవారం అంటూ హిట్టు కొట్టినా పాయల్ కి అవకాశాలు కరువయ్యాయి. ఈ ముద్దుగుమ్మ తెలుగులో మొత్తం 12 సినిమాల్లో నటిస్తే కేవలం రెండు మాత్రమే హిట్టయ్యాయి. యంగ్ హీరో కార్తికేయ సరసన ఆర్‌ఎక్స్ 100 మూవీ ,మంగళవారం సినిమా చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. ఈ భామ తెలుగుతోపాటు కన్నడ, పంజాబీలో పలు చిత్రాల్లో నటించింది. కానీ అక్కడ సైతం నిరాశే ఎదురైంది. ఇక చేసేదేమి లేక అందాల ఆరబోతతో కుర్రకారును కవ్విస్తూ ఉంటుంది పాయల్ రాజ్ పుత్.



## అరె ఏంట్రా ఇది..

రొమాంటిక్ సినిమాతోనే తెలుగు తెరకు పరిచయమై అందరి దృష్టిని ఆకర్షించింది కేతిక శర్మ. తొలి చిత్రంతోనే మంచి మార్కులు కొట్టేసింది.. కానీ ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద అంతగా సక్సెస్ కాలేదు. అయినా ఆఫర్స్ మాత్రం క్యూ కట్టాయి. గ్లామర్ షోతో కుర్రాళ్లను ఫిదా చేసిన ఈ అమ్మడు.. ఆ తర్వాత నాగ శౌర్య సరసన లక్ష్య, రంగ రంగ వైభవంగా, బ్రో సినిమాల్లో అవకాశాలు అందుకుంది. కానీ ఈ మూడు సినిమాలో బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్స్ అయ్యాయి. దీంతో ఇండస్ట్రీలో ఈ అమ్మడుకు అవకాశాలు తగ్గిపోయాయి. నెమ్మదిగా సినీరంగంలో సైలెంట్ అయ్యింది ఈ వయ్యారి. కానీ ఇటీవలే సింగిల్ మూవీతో భారీ హిట్టుకొట్టింది ఈ ముద్దుగుమ్మ. ఇందులో ఇవానా సైతం కథానాయికగా నటించింది. శ్రీవిష్ణు, ఇవానా, కేతిక శర్మ ప్రధాన పాత్రలు పోషించిన సింగిల్ సినిమాకు సూపర్ హిట్ రెస్పాన్స్ వచ్చింది. దీంతో కెరీర్ లో మొట్ట మొదటి హిట్టు అందుకుని ఫుల్ జోష్ మీదుంది కేతిక. అయితే ఈ అమ్మడుకు తెలుగులో అంతగా ఆఫర్స్ రావడం లేదని.. ప్రస్తుతం కేతిక సరైన ఛాన్స్ కోసం ఎదురుచూస్తుందని సమాచారం. సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ నిత్యం లేటేస్ట్ ఫోటోస్ షేర్ చేస్తుంది.

## బాబోయ్ రష్మిక మరీ ఇంత బోల్డ్ షోనా..



ఛలో సినిమాతో తెలుగు ప్రేక్షకులకి దగ్గరైన రష్మిక మందాన ఆ తర్వాత వైవిధ్యమైన సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఈ అమ్మడు చేసిన యానిమల్, పుష్ప 2, ఛావా లాంటి సినిమాలు ఎంత పెద్ద విజయాలు అందించాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ మూడు సినిమాలతో అమ్మడు బాక్సాఫీస్ క్వీన్ అయిపోయారు రష్మిక మందాన. ఇప్పుడు టాలీవుడ్‌లోనే కాక బాలీవుడ్‌లోను రష్మిక క్రేజ్ పీక్స్‌కి చేరింది. ఈ మధ్య సల్మాన్ హీరోగా మురుగదాస్ తెరకెక్కించిన సికిందర్ సినిమాతో ప్లేక్షకులని పలకరించిన ఈ ముద్దుగుమ్మకి నిరాశే ఎదురైంది. చిత్రం బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది.
వరుస హిట్‌స్‌తో దూసుకుపోతున్న రష్మికకి సికిందర్ రూపంలో బ్రేక్ పడింది. అయితే ప్రస్తుతం ఆయుష్మాన్ ఖురానాతో తమా సినిమా చేస్తున్నారు ఈ బ్యూటీ. ఇది మినహా మరే సినిమాకు సైన్ చేసినట్టు కనిపించడం లేదు. తెలుగులో ఎప్పుడో ఓకే చేసిన గాళ్‌ఫ్రెండ్, రెయిన్ బో సినిమాలతోనే సరిపెట్టుకున్నారు. ఈమె తీరు చూస్తుంటే కొన్నాళ్లు సినిమాలకు బ్రేక్ ఇచ్చేలా కనిపిస్తున్నారంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా రష్మిక, విజయ్ దేవరకొండ పీకల్లోతు ప్రేమలో మునిగితేలుతున్నారని, త్వరలోనే వారిద్దరి వివాహం జరగనుందని కొందరు జోస్యాలు కూడా చెబుతున్నారు.
ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రష్మిక గురించి మాట్లాడిన విజయ్ దేవరకొండ.. ఆమె చాలా మంచి వ్యక్తి. ఇంకా ఎన్నో మూవీస్‌లో తనతో యాక్ట్ చేయాలని ఉంది అని అన్నారు. మరి జీవిత భాగస్వామికి కావాల్సిన లక్షణాలు రష్మికలో ఉన్నాయా అనే ప్రశ్న ఎదురు కాగా, మంచి మనసు ఉన్న అమ్మాయి ఎవరైనా పర్వాలేదు అని సమాధానం చెప్పారు. మరి విజయ్ దేవరకొండ చెప్పిన సమాధానం బట్టి చూస్తుంటే తమ ప్రేమ గురించి క్లూ ఇచ్చారని, అఫీషియల్‌గా ప్రకటించడమే తరువాయి అని అంటున్నారు. ఇక ఇదిలా ఉంటే రీసెంట్‌గా జీ సినిమా అవార్డ్స్ ఈవెంట్‌కి హాజరైంది రష్మిక. బ్లాక్ డ్రెస్‌లో బోల్‌డ్‌గా కనిపిస్తూ అక్కడ ఉన్నవారితో సందడి చేసింది. ఫోటోగ్రాఫర్‌స్‌తో ఫొటోలకి పోజులిచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com